బొంబాయి నుండి రాత్రే వచ్చారు. అక్కడే చీఫ్ యింజనీర్‌గా వుంటున్నారు.''

యిద్దరం కరచాలనం చేసుకున్నాం.

''యిక ఈమె మా అత్తయ్యగారు. బొంబేలోనే ప్రొఫెసరుగా వుంటున్నారు.''

ఆశ్చర్యంగా నా కళ్ళు వెడల్పయ్యాయి. మాలతి ఎంత అదృష్టవంతురాలు? పెద్ద యింజనీర్ భార్య...పైగా ప్రొఫెసర్... నాకు కళ్ళు తిరిగినట్టయింది. నమ్మనట్టు ఆమెవంక చూసాను. మాలతి నిండుగా చిన్నగా నవ్వింది.

''అదేమిటండీ అలా చూస్తారు? మా అత్తయ్యకి మొదట్నుంచీ సింపుల్‌గా వుండడమంటేనే యిష్టం. అందుకే మా మామయ్య యాభైవేల కట్నాన్ని కూడా కాదని ఆమెని పెళ్లి చేసుకున్నారు.''

''చాల్లే సురేష్! మాటలు బాగా నేర్చావ్'' కసురుకుంది ముద్దుగా. మాలతి భర్త, సురేష్ యిద్దరు గట్టిగా నవ్వేసారు. నేను కూడా నవ్వేసాను. కాని, నాలో ఏదో తెలియని ఆవేదన—! తర్వాత సురేష్, మాలతి భర్త ఏదో పని మీద లోనికివెళ్ళిపోయారు. నేనూ, మాలతి, మిగిలాం... మా యిద్దరి మధ్యా మౌనం... కొంతసేపు పోయాక నేనే మాట్లాడాను.

''బాగున్నావా మాలతీ!''

''అయితే జ్ఞాపకమున్నానన్నమాట. యింతసేపూ నన్ను గుర్తుపట్టలేదేమోనని అనుకున్నాను'' అంది నా నవ్వుకి శ్రుతి కలుపుతూ.

''సరిపోయింది. నేను కూడా సరిగ్గా అలాగే అనుకున్నాను.''

తర్వాత మేం చాలాసేపు ఒకరి కుటుంబం గురించి యింకొకరం తెలుసుకున్నాం.

అలా ఆమెతో మాట్లాడుతోంటే నా కనిపించింది—నిజంగానే పెళ్లిళ్లు స్వర్గంలోనే నిర్ణయించబడతాయని.

ఒక వేళ నన్ను పెళ్లాడినట్లయితే మాలతి ప్రస్తుతం నా భార్యలాగే వంటింటి జీవితం గడిపేది. యిప్పుడో... ఆవిడ జీవితమే వేరు.

తమ అహంకార పూరితమయిన తళుకుబెళుకులతో, మధ్యతరగతి ఆడపిల్లల సుకుమార, సున్నిత హృదయాల్లో ఆశలురేపి, అవి తీరుతాయని ఆ కన్నెపిల్లలు తీయని కలలుకనే సమయంలో, వాటిని కసిదీరా నేలరాల్చే మగ మహారాజుల మధ్య, అర్ధాంగిగా ఆమెనే స్వచ్ఛంగా స్వీకరించి, ఆమె కన్నీటిని తుడవగలిగే సహృదయులు కూడా వుంటారని, నాకిప్పుడే తెలిసింది.

ఆకాశం ఎంత ఉరిమి, యింకెంత కురిసినా, తన రాకతో భూమాతని పులకరింపచేస్తుంది స్వాతిజల్లు.

జయలక్ష్మి పెళ్లి గురించి ఆడంబరంగా రమణమూర్తికి వ్రాయాలనుకున్న ఉత్తరం గురించి ఆలోచన నా మనసు నుండి తొలగించివేసాను. □

బహుమతి పొందిన చిట్టికథ

# పోటీ

— ఇల్లిందల సుందరీకృష్ణ



అప్పారావు, సుబ్బారావు ప్రాణస్నేహితులు. ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇద్దరూ వివాహితులే. ఒకే కాలనీలో పక్క పక్క యిళ్ళలో అద్దెకుంటున్నారిరువురూ. అప్పారావు భార్య జయ. సుబ్బారావు భార్య విమల. మొదట్లో రెండుజంటలూ బాగా కలిసిపోయారు. కాని రాను రాను వాళ్ళు కొన్ని యిబ్బందులకు గురి అయ్యారు. విమల, జయ పైకి కలిసిపోయినట్లు కనిపించినా యిద్దరికీ ఒకరంటే ఒకరికి అసూయ. విమల ఏ చీరకొన్నా జయదానికి ఎన్నో వంకలు పెట్టేది. వెంటనే అంతకన్నా ఎక్కువ ఖరీదు పెట్టి చీర కొనాల్సిందే. జయ ఏ వస్తువుకొన్నా దానికి నాణ్యత తక్కువని తను కొన్న ధర ఎక్కువపెట్టి కొన్న పెద్ద సైజుది కొనవల్సిందే. టి.వి దగ్గరనుంచి స్టీలు చెంబువరకూ పోటీయే యిద్దరికీ. వంటా వార్పుల విషయమే కాదు. ఆఖరికి యింటిముందు ముగ్గు వేయడం దగ్గరనుంచీ తనే అధికురాలిననే గర్వం యిద్దరిలో ఉండేది. ఆ గర్వం, ఆ అహం యిద్దరూ ప్రతిమాటలోనూ వ్యక్తం చేసేవారు. ఒక్కోసారి గంటల తరబడి వాదించుకొనేవారు. భర్తల జోక్యంతో మళ్ళీ మామూలుగా అయ్యేవారు. వీళ్ళ పిచ్చిపోటీ ఎక్కడిదాకా పోయిందంటే, ఒకరి కన్నా ఒకరు ఎక్కువ నగలు చేయించుకోవాలని భర్తలని వేధించడం మొదలు పెట్టారు. ఆఖరికి వారి సంసారాల్లో కీచులాటలు ప్రారంభమయ్యాయి. అడపాదడపా విమలా జయలు పోట్లాడుకొనేవారు.

అప్పారావుకు సుబ్బారావుకు మనశ్శాంతి లేకుండా పోయింది. ముఖ్యంగా వారిద్దరి స్నేహం ఎక్కడచెడుతుందోనని బెంగపెట్టుకున్నారు. పరిష్కార మార్గం వెతుక్కోసాగారు. అప్పారావు సుబ్బారావు ఆఫీసులకు శెలవులు పెట్టుకున్నారు వారం రోజులు. కారణాలు చెప్పకుండా వారం రోజులు ముభావంగా గడిపారు. శెలవులోనే అప్పారావు నెలాఖరునాడు భార్యతో రాత్రి తమ సామానంతా సర్దేసి వుంచమన్నాడు. యిల్లు ఖాళీచేస్తున్నట్లు కూడా చెప్పాడు. సామానంతా సర్దేసి పాక్ చేసి రెడీగా వుంచారు. చీకటితోనే లేచి, లారీ తెచ్చి సామాను లారీలో పెట్టించాడు. బయలుదేరేముందు సుబ్బారావుకి చెపుదామనుకున్నాడు. ఇంటికి తాళం వేసుంది. రాత్రి వాళ్ళు వాళ్ళ అత్తగారింటికి భోజనానికి వెళ్లినట్లు తెల్లారేక వస్తారని భార్య చెప్పింది. పోనీలే యిదీ మంచిదే తను యిల్లు మారుతున్న సంగతి రహస్యంగా వుంచాలనే కోరిక తీరింది. కొత్తయింట్లో దిగి సామానంతా సర్దుకున్నారు. సాయంత్రం తీరుబడిగా యింటి ముందర కుర్చీలో పేపరు చదువుతున్న అప్పారావు—లారీ ఆగిన శబ్దానికి తలెత్తి చూశాడు. కొయ్యబారిపోయాడు. పక్కవాటాలోకి సామాను దింపిస్తున్నాడు సుబ్బారావు.

ఇద్దరు గొప్పవాళ్ళవే కాదు ఇద్దరు మూర్ఖుల అభిప్రాయాలు కూడా ఒక్కలాగే వుంటాయిట! □